ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -149 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 7 జులై 2026

## అమరావతి, తిరుపతి రీజియన్ల రూపకల్పనకు

# 6 నెలల్లో మాస్టర్ ప్లాన్

**విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం**

**విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక**


**6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం**

**మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు**

**51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ**

**అమరావతి,జూలై 06ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ **మిగతా 2లో...**




## ఆరు రోజుల పాటు

# ప్రధాని విదేశీ పర్యటన

ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ

గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్

ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ,జూలై 06 (ఆంధ్ర ప్రగతి**

ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే **మిగతా 2లో...**



# యుద్ధోన్మాదులను చంపాల్సిందే

ఖమేనీ అంత్యక్రియలకు

భారీగా తరలి వస్తున్న జనం

ట్రంప్, నెతన్యాహూలపై ప్రజాగ్రహం

**టెహ్రాన్ : జూలై 06 ఆంధ్ర ప్రగతి**

ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగర వీధులు ప్రజా సందోహంతో కిక్కిరిసిపోయాయి. అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన మాజీ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన**మిగతా 2లో...**

## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్**

**అమరావతి,జూలై 06 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు.**మిగతా 2లో...**



## ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

**అమరావతి,జూలై 06ఆంధ్ర ప్రగతి**

ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా**మిగతా 2లో...**




# పర్యాటకంకు పెద్దపీట

**తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి**

**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ**

**ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు**

**పర్యాటకంపై సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్,జూలై 06 ఆంధ్ర ప్రగతి**

తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి **మిగతా 2లో...**



## ఎపిలో విలేజ్ మార్ట్‌లు

**మార్కెట్ ధరలకన్నా తక్కువగా సరుకుల విక్రయం**

**ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించిన మంత్రి నాదెండ్ల**



**గుంటూరు,జూలై 06ఆంధ్ర ప్రగతి**

గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాల అమ్మకాలు జరగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లాల్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌ను ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల **మిగతా 2లో...**

# కడలిలో కల్లోలం

**ఒకరు మృతి, ఆరుగురి గల్లంతు..**

**విశాఖలో కొనసాగుతున్న గాలింపు**



**అనకాపల్లి తీరంలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి**

**నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో సహాయక చర్యలు**

**సమాచారం కోసం మత్స్యకారుల కుటుంబసభ్యుల ఆందోళన**

**గాలింపు ముమ్మరం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం**

**విశాఖజూలై 06 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో సోమవారం రెండు వేర్వేరు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. అనకాపల్లి జిల్లాలో పడవ బోల్తా పడిన ఘటనలో ఒక మత్స్యకారుడు మృతి చెందగా, విశాఖ తీరంలో గల్లంతైన**మిగతా 2లో...**

## జూన్ 2028 నాటికి

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు**

**ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు**

**ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై 06 (ఆంధ్ర ప్రగతి**

దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ 2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

**ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్**



# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్‌లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

# జూన్ 2028 నాటికి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఎ÷-లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్‌ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్‌ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఎ÷-లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరావతి, తిరుపతి రీజియన్ల రూపకల్పనకు 6 నెలల్లో మాస్టర్ ప్లాన్

**మొదటిపేజీ తరువాయి**

రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు.

రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

# యుద్ధోన్మాదులను చంపాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

ప్రజానీకం కన్నీరుమున్నీరవుతున్నారు. కొందరైతే ఆగ్రహం పట్టలేక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలను హతమార్చాలని డిమాండ్ చేశారు. ఉదయం ప్రార్థనలు ప్రారంభం కావడానికి ముందే ప్రజలు పెద్ద ఎత్తున గ్రాండ్ మొసల్లాకు చేరుకున్నారు. ఇరాన్ పతాకాలతో పాటు ప్రతీకారానికి చిహ్నంగా ఎర్ర జెండాలను, ఖమేనీ చిత్ర పటాలను పట్టుకొని అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంత్యక్రియలు ప్రారంభమైన రోజుతో పోలిస్తే జనం తాకిడి చాలా ఎక్కువగా ఉంది. వాతావరణం ఉద్రేకపూరితంగా కన్పించింది. 'ప్రపంచంలోనే అత్యంత నీచమైన వ్యక్తి ఇంకా ఎందుకు జీవించి ఉన్నాడు? ట్రంప్‌కు ఈ ప్రపంచం ఇక ఎంత మాత్రం మంచి ప్రదేశం కాదు. మన ఇమామ్‌ను చంపిన వ్యక్తిని మనం ఎందుకు చంపకూడదు? మనం అలా చేయకపోతే అవమానకరం అవుతుంది' అని మహమ్మద్ రసూలీ అనే కవి జనసమూహాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. రసూలీ ప్రసంగిస్తున్నంత సేపూ ప్రజలు కరతాళధ్వనులతో తమ మద్దతు తెలియజేశారు. 'ట్రంప్‌ను చంపాల్సిందే' అని రాసి ఉన్న ప్లకార్డు ఓ వ్యక్తి చేతిలో కన్పించింది. అమెరికా-ఇజ్రాయిల్ సేనల దాడులు మొదలైన తర్వాత ఇరాన్ రాజకీయ, సైనిక నాయకత్వం బహిరంగంగా కలిసి కనిపించడం ఇదే మొదటిసారి. 'మీరు మనుషులను చంపగలరు. కానీ ఆదర్శాలను కాదు' అని అర్మేనియాలోని ఇరాన్ రాయబారి ఖలీల్ షిర్గోలామీ అన్నారు. పశ్చిమ దేశాలకు నాగరికత, చరిత్ర, గౌరవం లేవని మండిపడ్డారు. శత్రువులపై పగ, ఖమేనీ రక్తానికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మహమ్మద్ బఘేల్ జోల్గదర్ చెప్పారు. కాగా యుద్ధ సమయంలో ప్రజలకు దూరంగా ఉన్న పలువురు నేతలు, సైనికాధికారులు అంత్యక్రియలలో కనిపించారని 'ది గార్డియన్' పత్రిక తెలిపింది. ఖమేనీ కుమారులు ముస్తఫా, మసూద్, మెయిసామ్‌లు తండ్రి శవపేటిక పక్కనే నిలబడ్డారు. సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మాత్రం హాజరు కాలేదు. భార్య అంత్యక్రియలకు కూడా ఆయన వెళ్లలేదు. ఖోమ్‌కు చెందిన 97 ఏండ్ల మతగురువు నేతృత్వంలో ప్రార్థనలు జరిగాయి. యుద్ధోన్మాదానికి బలైన 14 నెలల ఖమేనీ మనుమరాలి శవపేటికను చూసి జనం భోరున విలపించారు. ఖమేనీ జన్మస్థలమైన మషద్‌లోని ఇమామ్ రెజా మందిరంలో ఖననం చేయడానికి ముందు పార్థివ దేహాన్ని ఇరాన్, ఇరాక్ మీదుగా ఊరేగింపుగా తీసికెళతారు. ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులో పాల్గొనేందుకు ప్రజలు సోమవారం నల్లని దుస్తులు ధరించి భారీగా తరలి వచ్చారు. ఖమేనీ భౌతికకాయం ఉన్న శవపేటికతో పాటు ఆయన కుటుంబ సభ్యుల శవపేటికలను కూడా ఓ ట్రక్కుపై ఉంచారు. శవపేటికలను టెహ్రాన్ వీధుల మీదుగా మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలిస్తు న్నారు. ఈ ప్రయాణానికి 12 గంటలకు పైగా సమయం పడుతుంది. ఊరేగింపు సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున కవాతు జరిపారు.

## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు





**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి**

నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు. అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు. అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

------------

## ఎపిలో విలేజ్ మార్ట్‌లు

**మొదటిపేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రస్తుతం ఒక్కరోజే 7 విలేజ్ మార్ట్‌లు ప్రారంభించామని తెలిపారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని 29,750 రేషన్ షాపులను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి నాదెండ్ల మండిపడ్డారు. గ్రామీణ రేషన్ వ్యవస్థలో కార్పొరేట్ తరహా సంస్కరణలు తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రేషన్ షాపులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 1,000 మినీ మార్ట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఓపెన్ మార్కెట్ రేట్ల కంటే రూ.3 నుంచి రూ.4ల తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు, మిల్లెట్స్ పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతానికి 60 రకాల సరకులతో మీ మార్ట్‌లు ప్రారంభించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో 250 రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. విలేజ్ మార్ట్‌ల్లో కూడా త్వరలోనే డిజిటల్ పేమెంట్స్ అవకాశం కల్పిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

### ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్

**అమరావతి,జూలై 06ఆంధ్ర ప్రగతి** ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ ఎ÷ఓ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

--------------

## పర్యాటకంకు పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

## కడలిలో కల్లోలం

**మొదటిపేజీ తరువాయి**


ఆరుగురు మత్స్యకారుల కోసం రెండో రోజూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రెండు సంఘటనలతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా రేవూపోలవరం తీరంలో నలుగురు మత్స్యకారులతో వెళుతున్న పడవ అలల ఉద్ధృతికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సురక్షితంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. చోడిపల్లి సింహాద్రి (రేవూపోలవరం వాసి) అనే మత్స్యకారుడు గల్లంతై మృతి చెందాడు. అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మరోవైపు విశాఖ తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నావికాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్, ప్రత్యేక నౌక, రెస్క్యూ బోట్లతో గాలింపును కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో కార్గో షిప్ ద్వారా రక్షించబడిన కారి చిన్న అనే మత్స్యకారుడు (బోటు యజమాని) ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయక చర్యలు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి 72 గంటలు చాలా కీలకమని, మత్స్యకారులు ప్రాణాలతో దొరుకుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి, గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఐజీ గోపీనాథ్ జెట్టి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో, ఈ నెల 1న వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. గల్లంతైన తమ వారి గురించి సరైన సమాచారం అందించడం లేదంటూ వారి కుటుంబసభ్యులు విశాఖలో ఆందోళన చేపట్టారు. దీంతో తీర ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.


# దేశ సమైక్యతకు శ్యామాప్రసాద్ ముఖర్జీ త్యాగాలే స్ఫూర్తి.

**-శ్యామాప్రసాద్ ముఖర్జీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి: -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు**

**-నంద్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ 125 జయంతి వేడుకలు.**












**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 06:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను నంద్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు నేతృత్వంలో పార్టీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు, ప్రజాసేవ తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం పోరాడి, నిర్బంధంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు.
కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370, 35ఏలను 2019లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం ద్వారా ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అర్పించిందని మధు కొనియాడారు. కలకత్తా వర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా విద్యా రంగానికి.. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రిగా దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టుల స్థాపనతో పారిశ్రామిక రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల వేగవంతంగా పరిష్కరించాలి.

**..అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలి. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు/జూలై06:** ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంతో పాటు ప్రతినెల మొదటి సోమవారం నాడు నిర్వహించే ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ఫిర్యాదులను స్వీకరిస్తున్న సమస్యలకు సంబంధించిన వినతులను కలెక్టర్ స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని, పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని సూచించారు. అధికారులందరూ క్రమం తప్పకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరవ్వాలని, గైర్హాజరును ఉపేక్షించకుండా, చర్యలు తీసుకొనబడతాయని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.



పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని సూచించారు.
ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, మరియు భూసమస్యలతో పాటు ఇతర చట్టపరమైన ఫిర్యాదులను, వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్టప్రకారం నిర్ణీత గడువులోగా వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బాధితులకు తక్షణ న్యాయం చేకూర్చేందుకు, అధికారులు, సిబ్బంది నిరంతరం క్రియాశీలకంగా పనిచేయాలని వ్యాఖ్యానించారు.
వారం రోజుల్లోగా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి సమర్పించాలి.ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓటరు నమోదు, సవరణలు శాతం వంద పూర్తి చేయాలి.రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ (ఓటర్ల ముసాయిదా జాబితా) ప్రచురణను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఓటరు నమోదు, వివరాల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం కేటాయించిన ఎన్యుమరేషన్ ఫారమ్‌లు ను వారం రోజుల్లోగా పూర్తి చేసి సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్ఓలు) తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో ఓటు హక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖాధిపతి తమ కార్యాలయంలోని సిబ్బందికి ఈ సమాచారాన్ని వెంటనే చేరవేసి, ఫారమ్‌ల పంపిణీ, పూరణ, సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులో శాతం వంద పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఎన్యుమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు ప్రతి పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారమ్‌కు అభ్యర్థి ఇటీవల తీసిన పాస్‌పోర్ట్ సైజు ఫోటోను తప్పనిసరిగా జత చేయాలి. ఈ ప్రక్రియలో అంగీకరించబడే 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల వివరాలతో కూడిన సర్క్యులర్‌ను ఇప్పటికే అన్ని శాఖల కార్యాలయాల అధికారిక గ్రూపులలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పుట్టిన సంవత్సరం ఆధారంగా సమర్పించాల్సిన గుర్తింపు పత్రాలు: 1987కు ముందు పుట్టిన వారు: తమ స్వంత గుర్తింపు పత్రం మాత్రమే సమర్పిస్తే సరిపోతుంది. 1987 నుంచి 2004 మధ్య పుట్టిన వారు: తమ స్వంత గుర్తింపు పత్రంతో పాటు తల్లి లేదా తండ్రి గుర్తింపు పత్రాన్ని కూడా జత చేయాలి. 2004 తర్వాత పుట్టిన వారు: తమ స్వంత గుర్తింపు పత్రంతో పాటు తల్లి మరియు తండ్రి ఇద్దరి గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, కార్యాలయాధిపతులు తమ పరిధిలోని ప్రతి ఉద్యోగికి ఈ మార్గదర్శకాలను తెలియజేసి, ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, పూరణ, సేకరణ ప్రక్రియను ఒక వారం గడువులోగా శాతం వంద పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ సిద్ధీకరణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి అర్హుడి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా. లోకనాథ్, జిల్లా సామాజిక సంక్షేమ అధికారి రాధిక, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, జిల్లా విద్యాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ సేవలకు ఇక బ్రేక్.

**-ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్న టీడీపీ నేతలు. -మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 06:** నంద్యాల ప్రజల గుండెల్లో మరో సేవా సంస్థ మూతపడింది. రాజకీయ కక్షసాధింపుల మధ్య.. ఒక అద్భుతమైన ప్రజా సేవకు బ్రేక్ పడింది..! దాదాపు 28 ఏళ్లుగా నంద్యాల ప్రజలకు సేవలందిస్తూ.. అండగా నిలిచిన శిల్పా సేవాసమితి ఆశయాల పై.. అధికార పక్షం రాజకీయాల ముళ్ళకంచె వేసింది..! నంద్యాల నడిబొడ్డున పేద, మధ్యతరగతి వర్గాలకు నమ్మకమైన ఆదర్శంగా నిలిచిన "శిల్పా సహకార్ సూపర్ మార్కెట్" ఇకపై కనిపించదు.. సేవలందించదు..!




పంతాలు.. పట్టింపులు.. రాజకీయ కక్షల మధ్య ఈ సూపర్ మార్కెట్‌ను బలవంతంగా మూసివేయించారంటూ.. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల ప్రజలకు సేవ చేయలేకపోతున్నామంటూ మీడియా సాక్షిగా క్షమాపణలు కోరారు..!"28 సంవత్సరాలుగా మా నాన్నగారు శిల్పా మోహన్ రెడ్డి నంద్యాల ప్రజల కోసం ఈ సేవా సమితిని నడిపారు. 23 ఏళ్లుగా పాడుబడిపోయిన మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌ను మా సొంత ఖర్చులతో రిపేర్ చేసి రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఒక సహకార సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశాం. 2009 నుంచి ఏ రోజూ, ఏ ప్రభుత్వం కూడా దీనిపై కక్ష సాధింపులు చేయలేదు. కానీ ఈరోజు కేవలం మాపై ఉన్న రాజకీయ కక్షతోనే ఉద్దేశపూర్వకంగా ఖాళీ చేయించారు. నంద్యాల ప్రజలారా.. మమ్మల్ని క్షమించండి. మీకు ఇకపై మేము ఈ సేవలు అందించలేకపోతున్నాం. రాజకీయ కక్షలు నాయకుల మధ్య ఉండాలి. కానీ పేదల పొట్ట కొట్టేలా మారకూడదు. శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ మూతపడటంతో కేవలం ఒక బోర్డు మాత్రమే పడిపోలేదు.. అక్కడ నమ్ముకుని బతుకుతున్న 45 మంది పేద మహిళల ఉపాధి రోడ్డున పడింది..! ఆ కుటుంబాల దీనస్థితికి ఎవరు సమాధానం చెప్తారు.? ఇదేనా మీ అభివృద్ధి? గతంలో డాక్టర్ వైఎస్సార్ కళ్యాణమండపం ద్వారా పేదలు కేవలం 5 వేల నుండి 9 వేలకే పెళ్లిళ్లు చేసుకునేవారు. కానీ దాన్ని చేజిక్కించుకుని, ఈరోజు ఆ ఫీజును అక్షరాలా లక్షన్నరకు పెంచేసి పేదల రక్తాన్ని పిండుతున్నారు..! చేతనైతే సేవ చేయండి. అంతేకాని సేవ చేసేవాళ్లకు డ్డుపడకండని శిల్పా రవి రెడ్డి మండిపడ్డారు.
ఐపీఎల్ వేలాన్ని తలపించేలా.. కేవలం శిల్పా సేవాసమితిని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ వేలం పాటలు సాగాయని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన మార్కెట్ యార్డ్ స్థలాన్ని.. ఎకరాకు కేవలం వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లు లీజుకు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏంటి? వక్ఫ్ భూములను ముస్లింల సంక్షేమానికి వాడకుండా.. ఎస్పీ కార్యాలయానికి ఇవ్వడం ఎంతవరకు సబబు?
మీకు అంతగా కావాలంటే.. మీ పార్టీ కార్యాలయం కోసం చూసుకున్న నూనెపల్లె మార్కెట్ యార్డ్ స్థలాన్ని ఎస్పీ ఆఫీస్‌కు ఇవ్వొచ్చు కదా అని శిల్పా రవి రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ ప్రజలకు జరిగే సేవ శాశ్వతంగా ఉండిపోతుంది. ఒక మంచి వ్యవస్థను కూల్చేసి సాధించే రాజకీయం ఎవరికి లాభం? 45 మంది మహిళల కన్నీళ్లు.. వేలాది మంది నంద్యాల ప్రజల ఆవేదన.. ఎటు దారితీస్తుంది? నంద్యాల ప్రజల గుండెల్లో రేగిన ఈ మంటకు.. అధికార పక్షం సమాధానం చెప్తుందా? "సేవను ఆపడం రాజకీయం అనిపించుకోదు.. కక్షసాధింపు మాత్రమే అవుతుందన్నారు!"

## అమరావతి ఛాంపియన్‌షిప్2026 పోస్టర్ ఆవిష్కరణ.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు/జూలై 06:** కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అమరావతి ఛాంపియన్‌షిప్2026 పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువతలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండర్-17, అండర్-23 విభాగాల్లో 12 క్రీడాంశాలతో ఈ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించి విజేతలకు మొత్తం రూ.91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొంటూ, యువత పెద్ద ఎత్తున నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఈనెల 8న నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో డా. వైఎస్సార్ విగ్రహ పునఃప్రతిష్ట.. విజయవంతం చేయండి.

**-ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపు.**



**ఆంధ్రప్రదేశ్ నంద్యాల జూలై 06:** నంద్యాల పట్టణంలో ఈనెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్య విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వెల్లడించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గత మే నెలలో నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందేనని ఆయన గుర్తు చేశారు. విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తామే బాధ్యత తీసుకున్నట్లు తెలిపారు. గతంలో శ్రీనివాస సెంటర్‌లో ప్రజల సమక్షంలో చెప్పిన విధంగానే.. ఈనెల 8న వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని భారీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి నంద్యాల నియోజకవర్గంలోని వైఎస్సార్ అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సంక్షేమ పథకాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం.

**- ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి.**

**-జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు/జూలై 06:** విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో ప్రజల అప్రమత్తత అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన సమావేశ మందిరంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... విద్యుత్ శాఖ విడుదల చేసిన భద్రతా సూచనలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపార సంస్థలు, నిర్మాణ రంగ కార్మికులు, ప్రజలందరూ విద్యుత్ పరికరాలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, దెబ్బతిన్న విద్యుత్ తీగలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే విద్యుత్ పనులను అర్హత కలిగిన సిబ్బందితో మాత్రమే చేయించాలని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదని, పిల్లలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి భద్రతా మార్గదర్శకాలను పాటించాలని జాయింట్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మంత్రి ఫరూక్ కి ఏపీ పెన్షనర్ల సంఘం వినతి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 06:** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ (నంద్యాల జిల్లా శాఖ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యల వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లారు. 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగుల హెల్త్ కార్డ్ వ్యవస్థను మెరుగుపరచాలని , పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు మరియు పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని . కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని వినతి పత్రంలో కోరారు.. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ పై అంశాలను సంబంధిత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా బ్రాంచ్ డిస్టిక్ ప్రెసిడెంట్ కె రామసుబ్బయ్య , అసోసియేషన్ ప్రెసిడెంట్ గఫార్, సెక్రటరీ మేకల లింగస్వామి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ తోటరామయ్య, ట్రెజరర్ కాసిం వలి, వైస్ ప్రెసిడెంట్ డీకయ్య , జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరాజు, రవీంద్రనాథ్, జనార్ధన్, సుధాకర్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలి.

**..ప్రతి అంశంలో ఖచ్చితమైన సమాచారం, నాణ్యమైన ప్రజెంటేషన్ ఉండాలి.**

**..అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో సిద్ధంగా ఉండాలి. -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 06:**



రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, పూర్తి సన్నద్ధతతో పనిచేసి ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనకు సంబంధించిన నోట్స్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అధికారులు అత్యంత క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వివరాల నమోదు, స్పెల్లింగ్, డ్రాఫ్టింగ్ లేదా ఇతరత్రా లోపాలు ఏవైనా ఉంటే వెంటనే సరిదిద్ది, సవరించిన సమాచారాన్ని తక్షణమే సమర్పించాలని సూచించారు. స్టాళ్ల ఏర్పాటు, ఫ్లెక్సీల రూపకల్పన, ప్రదర్శించనున్న అంశాలు, ముఖ్యమంత్రికి సమర్పించనున్న బ్రీఫింగ్ నోట్స్‌ను కూడా వెంటనే సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. ప్రతి శాఖకు సంబంధించిన గణాంకాలు పూర్తిగా ఖచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా భూగర్భ జలమట్టాలు, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, సామాజిక భద్రత పెన్షన్లు, స్వయం సహాయక సంఘాలు, బంగారు కుటుంబం, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల వివరాలను పలుమార్లు పరిశీలించి సరైన సమాచారాన్నే సమర్పించాలని సూచించారు. హౌసింగ్, మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్లు, రేషన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్ల వంటి వ్యక్తిగత లబ్ధిదారుల వివరాలను అత్యంత జాగ్రత్తగా ధృవీకరించాలని ఆదేశించారు. యాక్షనబుల్ పాయింట్స్‌లో ప్రతి అంశానికి కొలిచే విధంగా స్పష్టమైన గణాంకాలు ఉండాలని తెలిపారు. మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, మిర్చి ఉత్పత్తి, పండ్ల తోటలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, పరిశ్రమల సంఖ్య, 500 ఎంఎస్ఎంఈల ద్వారా కల్పించిన ఉపాధి తదితర వివరాలను స్పష్టమైన సంఖ్యలతో సమర్పించాలని సూచించారు. అలాగే సబ్‌సెక్టార్ వారీగా జీవీఏ (+వూ), జిల్లా 15 శాతం వృద్ధిరేటుకు సంబంధించిన వివరాలను గ్రాఫ్‌ల రూపంలో కాకుండా స్పష్టమైన గణాంకాలతో పొందుపరచాలని ఆదేశించారు. టూరిజం, జలహారతి, ప్రకృతి వ్యవసాయం, స్మార్ట్ వాటర్ మానిటరింగ్, సహకార రంగ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, సమయపాలనతో, తమ శాఖ అంశాలపై సంపూర్ణ అవగాహనతో పనిచేసి సీఎం పర్యటన విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి ఫరూక్ కు వినతి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 06:**



నంద్యాల ఆర్టీసీ డిపో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ.. రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నంద్యాల బస్టాండ్ ఆవరణలో రిటైర్డ్ అసోసియేషన్ కార్యాలయం కోసం కేటాయించవలసిన స్థల సమస్యను మంత్రి ఫరూక్ గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి, సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆంజనేయులు పిలుపు మేరకు రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి ఫరూక్ గారికి మరో వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి ఫరూక్ స్పందిస్తూ, రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డిపో కార్యదర్శి మేడ బుద్ధుడు అధ్యక్షతన, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి.బి. తిమ్మయ్య , ప్రసాద్ , రీజనల్ ప్రెసిడెంట్ ఆర్.సి. ఓబులేసు , డిపో ప్రెసిడెంట్ చంద్రమౌళి , రీజనల్ కమిటీ సభ్యులు పి.ఎం. గౌడ్, నాయకులు చెన్నారెడ్డి, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు వివరాలు తప్పనిసరిగా సరిచూసుకోండి.

**..ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 06:**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ధారించుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం నంద్యాల పట్టణంలో కొనసాగుతున్న ఓటరు సర్వే, ఎన్యూమరేషన్ ప్రక్రియను కమిషనర్ బి. శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల పనితీరు, ఇంటింటి సర్వే పురోగతి, ఓటర్ల నుంచి సేకరిస్తున్న వివరాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు సమర్పించే ఎన్యూమరేషన్ పత్రాల్లో పేరు, తల్లిదండ్రుల పేరు, చిరునామా, జన్మతేదీ తదితర వివరాలు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డులో నమోదైన వివరాలతో సరిపోలేలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సందేహాలు ఉన్నా లేదా బీఎల్‌వోలు ఇంటికి రాకపోయినా ఎన్నికల సంఘం టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి పూర్తి సమాచారం పొందవచ్చని చెప్పారు. అదేవిధంగా, ఆన్‌లైన్‌లో ఓటరు వివరాలను నమోదు చేయాలనుకునే వారు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్, ఓటరు గుర్తింపు కార్డు (ఈపిక్) వివరాలతో లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు.

ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పిలుపునిచ్చారు. కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విక్రమ్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# షూటింగ్ బాల్ పోటీల్లో 'శ్రీ శాంతినికేతన్' విద్యార్థుల జైత్రయాత్ర.

**-.రాష్ట్ర స్థాయికి నలుగురుఎంపిక.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 06:**



నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్‌లోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో అద్భుత ఘనత సాధించారు. జూలై 4న నంద్యాల ఎస్పీజీ మైదానంలో నిర్వహించిన షూటింగ్ బాల్ ఎంపిక పోటీలలో అసాధారణ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతికి చెందిన సుధీర్ కుమార్ రెడ్డి, ఎం. సంతోష్, మరియు 9వ తరగతికి చెందిన ఎం. శివనాయక్, ఎం. చరణ్ నాయక్ ఈ ఘనత సాధించిన వారిలో ఉన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాల కీర్తిని చాటిన ఈ విద్యార్థులను పాఠశాల చైర్మన్ సుధాకర్ సార్ ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ఇలాంటి ప్రతిభ చాటడం గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా విజేతలైన నలుగురు క్రీడాకారులకు చైర్మన్ సుధాకర్ సార్ చేతుల మీదుగా ఘనంగా మెమెంటోలు అందజేసి ప్రశంసించారు. రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా వీరు ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్యూమరేషన్ ఫారాల సేకరణతో పాటు

# డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి.

**..“బుక్ ఏ కాల్“కు సంబంధించి పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టండి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 06:**

ఎన్యూమరేషన్ ఫారాల సేకరణతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఏఈఆర్ఓ లను ఆదేశించారు. సోమవారం సర్ డిజిటైజేషన్ ప్రక్రియ అంశం పై కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిన్నటిరోజున కోడుమూరు 6.3 శాతం, పత్తికొండ 6.03 శాతం పురోగతి నమోదు చేయగా, మిగతా నియోజకవర్గాల్లో తక్కువగా నమోదు అయిందని తెలిపారు. ప్రతి



ఏఈఆర్ఓ ఉదయం 6, సాయంత్రం 6 పోలింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయాలని అప్పుడే బిఎల్ఓ లు, సూపర్వైజర్ లు ఏ విధంగా పని చేస్తున్నారనే విషయాలు తెలుస్తాయన్నారు. కృష్ణగిరి, గూడూరు, తుగ్గలి, కర్నూలు రూరల్, పాణ్యం మండలాలు బాగా పని చేశారని కలెక్టర్ సంబంధిత ఏఈఆర్ఓ లను అభినందించారు. హాలహర్వి, ఆస్పరి, కర్నూలు అర్బన్ మండలాలు డిజిటైజెషన్ ప్రక్రియలో పురోగతి సాధించాలని కలెక్టర్ సంబంధిత ఏఈఆర్ఓ లను ఆదేశించారు. డిజిటైజెషన్ ప్రక్రియలో ఏ ఒక పోలింగ్ కేంద్రం కూడా రేపటికి 40 శాతం కంటే తక్కువ ఉండకూడదన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుండి డిజిటైజెషన్ ప్రక్రియకు సంబంధించిన ఫార్మ్స్ ను తీసుకొని డిజిటైజెషన్ ప్రక్రియ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఈఆర్ఓ లను ఆదేశించారు. ప్రజలకు తెలిసేలా పట్టణాల్లో మైక్ అనౌన్స్మెంట్, గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్‌తో మీ ఇంటికి రక్షణ.

**నంద్యాల పట్టణ ప్రజలకు అడిషనల్ ఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్ విజ్ఞప్తి.**

**.. పోలీస్ వారు ప్రవేశపెట్టిన ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలు ప్రజలు వినియోగించుకోండి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూలై 06:**

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు, పట్టణంలో దొంగతనాల నివారణకు మరియు ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్' అనే పోలీసు వారి సేవను ప్రజలు వినియోగించుకోవాలని నంద్యాల సబ్ డివిజన్‌లో ప్రారంభిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కుమారి ఎం. జావళి ఆల్ఫోన్స్, ప్రకటించారు.

ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో దొంగతనాలకు అవకాశం లేకుండా ఈ వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు.




**LHMS యాప్ వినియోగం మరియు ప్రయోజనాలు:**

**యాప్ డౌన్లోడ్:**

ప్రజలు గూగుల్ ప్లే స్టోర్ నుండి LHMS AP Police యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

**రిక్వెస్ట్ పంపడం:**

మీరు ఇల్లు వదిలి బయటకు వెళ్లేటప్పుడు, ఏ తేదీ నుండి ఏ తేదీ వరకు ఇంటికి తాళం వేసి ఉంటుందో యాప్ ద్వారా 'వాచ్ రిక్వెస్ట్' పంపాలి.

**సిసిటివి ఏర్పాటు:**

మీ రిక్వెస్ట్ అందిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి సిబ్బంది మిమ్మల్ని సంప్రదించి, మీ ఇంటి వద్ద ఉచితంగా అధునాతన సిసిటివి కెమెరాను ఏర్పాటు చేస్తారు.

**లైవ్ మానిటరింగ్:**

ఈ కెమెరాలు మోషన్ డిటెక్షన్ సెన్సార్లతో పనిచేస్తాయి. ఇంటి వద్ద ఏ చిన్న అలజడి జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళ్తుంది, తద్వారా పోలీసులు తక్షణమే స్పందించి దొంగతనాలను అరికడతారు.

వాట్సాప్ ద్వారా రిక్వెస్ట్: యాప్ అందుబాటులో లేని వారు పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 9154877890 కు సమాచారం అందించవచ్చు. అలాగే 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా రిక్వెస్ట్ పంపవచ్చు.

**ముఖ్య సూచనలు:**

ప్రస్తుతం మా వద్ద పరిమిత సంఖ్యలో కెమెరాలు ఉన్నందున, ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

ప్రజలు తమ ఇళ్ల వద్ద సొంతంగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మరియు వీలైతే తలుపులకు మోషన్ సెన్సార్ అలారమ్స్ అమర్చుకోవాలని సూచించారు.

బయట ఊళ్లకు వెళ్లేటప్పుడు విలువైన నగలు, నగదును ఇంట్లో ఉంచకుండా నమ్మకస్తుల వద్ద లేదా బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలని కోరారు. నంద్యాల పట్టణ మరియు శివారు ప్రాంతాల ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసులకు సహకరించాలని అడిషనల్ ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా అర్జీలను నాణ్యతతో సత్వరమే పరిష్కరించాలి.

**..పిజిఆర్ఎస్ కు 325 దరఖాస్తులు.**

**..జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై, 06:**

ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరిస్తున్న ప్రతి అర్జీని నాణ్యతతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డిఆర్ఓ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) ద్వారా ప్రజల నుండి స్వీకరిస్తున్న ప్రతి అర్జీని అత్యంత నాణ్యతతో, అర్జీదారుడు పూర్తిగా సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు కేవలం అర్జీలను క్లోజ్ చేయడం కోసం కాకుండా, సమస్య మూలాల్లోకి వెళ్లి అర్జీదారుడు మెచ్చేలా, శాశ్వత పరిష్కారం చూపేలా నాణ్యతతో పని చేయాలన్నారు. గతంలో పరిష్కారమయ్యాక కూడా దరఖాస్తుదారులు అసంతృప్తితో మళ్లీ సమర్పించిన (రీఓపెన్) అర్జీలపై అధికారులు ప్రత్యేక



దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అవి పదే పదే రీఓపెన్ కాకుండా తగిన కృషి చేయాలన్నారు. ప్రతి అర్జీకి నిర్దేశించిన కాలపరిమితి లోపే నాణ్యమైన రీతిలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, అర్జీదారులకు జవాబుదారీతనంతో సేవలు అందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిఆర్ఓ స్పష్టం చేశారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 177 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని డిఆర్ఓ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 177 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 5, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 12, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 50, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 73, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 31, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 3గా ఉన్నాయని డిఆర్ఓ వివరించారు.

1) నంద్యాల పట్టణానికి చెందిన సి.లక్ష్మి తనకు ఎలాంటి సొంత ఇల్లు లేదని తనకు ప్రభుత్వం నుండి సొంత ఇల్లు ఇప్పించగలరని కోరుతూ డిఆర్ఓ కు దరఖాస్తు సమర్పించారు.

2) డోన్ మండలం, కామగానికుంట్ల గ్రామానికి చెందిన వడ్డె కుంచెపు మద్దయ్యకు గ్రామ పొలిమేరలో సర్వే నెం.381/బి2లో 0.10 సెంట్లు, 383/3లో 0.42 సెంట్లు, 383/4లో 0.29 సెంట్ల భూమిని ఆన్లైన్ లో నమోదు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ కు అర్జీ అందజేశారు. 3) మిడ్తూరు మండలం, మాసాపేట గ్రామానికి చెందిన అక్బర్ బాషాకు సర్వే నెం.136లో 3.16 సెంట్ల భూమి కలదని, కానీ రీసర్వేలో 2.64 సెంట్ల స్థలం మాత్రమే ఆన్లైన్ లో నమోదు అయ్యిందని మిగతా భూమిని ఆన్లైన్ ఎక్కించగలరని కోరుతూ డిఆర్ఓ కు దరఖాస్తు ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.


**..నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు. -నంద్యాల 1వ పట్టణ పదాధికారుల సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 06:**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా పార్టీ శ్రేణులన్నీ సమాయత్తం కావాలని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. నంద్యాల ఒకటో పట్టణ పదాధికారుల విస్తృత స్థాయి సమావేశం పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణ ఇంచార్జి కశెట్టి కృష్ణమూర్తితో పాటు పట్టణ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**వార్డుల వారీగా కమిటీల బలోపేతం**

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమని, ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు



బాధ్యతాయుతంగా పనిచేసి విజయకేతనం ఎగురవేయాలని సూచించారు. వార్డుల వారీగా కమిటీలను బలోపేతం చేసుకుంటూ, ప్రజల్లోకి బలంగా వెళ్లాలని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**సమన్వయంతోనే విజయం : కశెట్టి కృష్ణమూర్తి**

పట్టణ ఇంచార్జి కశెట్టి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో పార్టీ బలోపేతానికి అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. నాయకుల మధ్య సమన్వయమే గెలుపుకు తొలిమెట్టు అని, రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తామని వెల్లడించారు.

**ప్రచార వ్యూహాలపై సుదీర్ఘ చర్చ**

పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు నేతృత్వంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, ప్రచార కమిటీల ఏర్పాటుపై పదాధికారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల 1వ పట్టణ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని ఒకే తాటిపైకి వచ్చారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచేలా అని శాఖలు మెరుగైన సేవలు అందించాలి.

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 06:**
ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచేలా అని శాఖలు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశం పై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాల పర్యటనలు నిర్వహించే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన, ఇంజినీరింగ్ శాఖలు, రహదారులు, తాగునీటి సరఫరా, పాఠశాలలు తదితర అన్ని అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నియోజకవర్గ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌కు ఉన్న స్థాయిలోనే నియోజకవర్గ ప్రత్యేక





అధికారులు తమ పరిధిలోని ప్రతి అంశంపై సమగ్ర సమాచారం కలిగి ఉండాలని, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం ఏర్పడేలా సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.. ప్రతి నెలా సీపీఓ పంపించే చివరి స్థానాల్లో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ యూనిట్ల జాబితా వచ్చిన వెంటనే, సంబంధిత సిబ్బందిని అక్కడికి పంపించి, వాస్తవ పరిస్థితి ఏమిటో స్వయంగా తెలుసుకోవాలన్నారు. అదే విధంగా అధికారులు కూడా తప్పనిసరిగా క్షేత్రస్థాయికి పనితీరు ఎందుకు తక్కువగా ఉంది? బలహీన పనితీరుకు గల అసలు కారణాలు ఏమిటి? వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలో తాగునీటి నాణ్యతకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వేలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు.. విద్యా శాఖ కు సంబంధించి పాఠశాలల్లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు, ఆదోని, తుగ్గలి, ఆలూరు, కొడుమూరు తదితర ప్రాంతాల్లో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్ల నాణ్యత, మధ్యాహ్న భోజనం మొత్తం నాణ్యత, అలాగే చిక్కీ పంపిణీ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రతికూల ప్రజాభిప్రాయం ఏర్పడితే సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణించి నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.. ఆర్ ఓ ఆర్ అంశంలో కూడా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డి ఆర్ ఓ ను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖ కు సంబంధించి ఆలూరు, ఆస్పరి, ఆదోని మండలాలో రిజిస్ట్రేషన్ సేవలను బాగా పెంచి ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కు సంబంధించి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంది సిటిజన్ లతో మర్యాద పూర్వకంగా మాట్లాడి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ లకు సంబంధించి ప్రజల నుండి సానుకూల స్పందన మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, డిటిసి లలో కూడా పురోగతి తీసుకొని రావాలన్నారు. పంచాయతీ సెక్రెటరీ లు గ్రామాల్లో సేవలు బాగా అందించాలన్నారు. రోడ్లపై లేదా రోడ్ల పక్కన ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు ఫీల్డ్ విజిట్లను గణనీయంగా పెంచాలని, కనీసం ఒకటి నుంచి రెండు నెలలపాటు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. పబ్లిక్ టాయిలెట్లు, వీధి దీపాలు వంటి అంశాలను కూడా స్వయంగా పరిశీలించాలన్నారు. డిఆర్డిఏ కు సంబంధించి పెన్షన్ పంపిణీ లో ప్రజల నుండి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పురోగతి మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కు సంబంధించి ప్రజలను మెడిసిన్ కు ఎట్టి పరిస్థితుల్లో బయటికి పంపకూడదన్నారు. ప్రతి రోజు కార్యాలయం కు వచ్చే ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధంగా క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డి టి సి కి సంబంధించి సేవలు మరింత బాగా ప్రజలకు అందించాలన్నారు. ఆర్ అండ్ బి, మెప్మా , ఎఫ్ లైన్ సర్వే, డి ఎస్ డి ఓ, తదితర శాఖలు కూడా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, సిపిఓ భారతి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహా రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

**..ప్రతి అంశంలో సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలి.**

**..బనగానపల్లెలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె/నంద్యాల, జూలై 06:**
ఈ నెల 9వ తేదీన బనగానపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాన్, ముఖ్యమంత్రి పర్యటన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రజావేదిక, పార్కింగ్ ప్రాంతాలు, తహసీల్దార్ కార్యాలయం, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించే ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని, ప్రతి ఏర్పాటును అత్యంత నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి చిన్న లోపానికీ తావు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి సభకు వేలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, షామియానాలు, కూర్చునే ఏర్పాట్లు, తగిన బ్యారికేడింగ్



తదితర అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సులభంగా రాకపోకలు సాగించేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. పోలీసు, రెవెన్యూ, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించనున్న నేపథ్యంలో కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకోనున్నందున రైతుల సమావేశం సజావుగా సాగేలా వేదిక, సమావేశ నిర్వహణ, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలను పకడ్బందీగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ప్రతి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి, కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాలలో టెట్ -2026 ఉర్దూ మీడియం స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 06:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నంద్యాలలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్‌లో టెట్ -2026 (ఉర్దూ మీడియం) సి.ఇ.డి.ఎమ్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ మరియు ఉచిత పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఆయన తన చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉర్దూ మీడియం విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే ఈ స్టడీ మెటీరియల్‌ను రూపొందించి ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోటీ పరీక్షల్లో రాణించి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎండి ఫిరోజ్, రామచంద్రరావు , అంజద్ భాషా, సబిహా పర్వీన్, మునియార్ ఖలీల్ , దస్తగిరి, రఫీ అహ్మద్, అస్మద్దీన్ , మిద్దె ఉసేని, రఫీ, ఆరిఫా భాను , అబ్దుల్లా అజీజ్ , భాను, పిట్టల హనీఫ్, గోవింద నాయుడు, జిల్లెల్ల శ్రీరాములు స్థానిక ప్రజాప్రతినిధులు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, విద్యావేత్తలు మరియు పెద్ద సంఖ్యలో ఉర్దూ మీడియం విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాలకు నూతన ఐపిఎస్ అధికారిని శ్రీమతి ఆర్. సుస్మిత.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 06:**



నంద్యాల జిల్లాకు నూతనంగా ఐపీఎస్ అధికారిని శ్రీమతి ఆర్ .సుస్మిత రామనాథన్ ని అసిస్టెంట్ సూపర్టెండెంట్ఆఫ్ పోలీస్ ఏఎస్పీగా వచ్చారు. ఆమె 1995 వ సంవత్సరంలో సొంత రాష్ట్రం తమిళనాడులో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ కేడర్ కు చెందిన 2023-11-13 ,వ సంవత్సరం బ్యాచ్ అధికారిని ఇండియన్ పోలీస్ సర్వీసులో చేరడానికి ముందు ఆమె గణనీయమైన వ్యక్తిగత ప్రతికూలతలను అధిగమించి ఆమె పేరు ప్రతిష్టలు సంపాదించుకొని ఎంతో ప్రసిద్ధి చెందారు. బాల్యం నుంచి ఆమె నేపథ్యము శ్రీమతి సుస్మిత రామనాథన్ ఐపీఎస్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన కుటుంబం ఆమె కుటుంబం ఎంతో వేదనకు గురై న కుటుంబం ఆమె తండ్రి జీడి రైతు 2004 వ సంవత్సరంలో హిందూ మహాసముద్ర సునామి వల్ల వారి తండ్రిగారి జీవనోపాధి నాశనమైంది. తమ ఇంటిని కోల్పోయి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తెల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు గతంలో ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రింట్ మీడియా ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. ఆమె ఇంజనీరింగ్ లో బి .ఇ, బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీర్ డిగ్రీ తమిళనాడు యూనివర్సిటీ నుండి తీసుకున్నది ఆమె యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జర్నీని పరిశీలించినట్లయితే ఆమె పట్టుదలతో సుస్మిత తన తొలి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రయత్నాలలో ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నప్పటికి ఆమె ఎన్నడూ పట్టుదలను, ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా వదులుకోకుండా చివరకు 2022 వ సంవత్సరంలో తన ఆరవ ప్రయత్నములో సివిల్ సర్వీసెస్ పరీక్ష ఉత్తీర్ణత సాధించి ఆల్ స్టార్ ర్యాంకు పొందింది. దేశపు ఆల్ ఇండియా ర్యాంకు 528 సాధించినది. ఆంధ్రప్రదేశ్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో 2026 సంవత్సరంలో ఆమె ఆంధ్రప్రదేశ్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రతిష్టాత్మక పేరేడ్ కమాండర్ గా పని చేశారు. ప్రస్తుతము జూలై 2026 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సుస్మితను అధికారికంగా నంద్యాల ఏఎస్పీగా బదిలీ చేసి ఆమెను నియమించింది ఆమె శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి ఉన్నత మరియు గ్రామీణ పోలీస్ కార్యకలాపాలను నిర్వహించడంలో ఆమెకున్న నేపథ్యం అత్యంత క్రమశిక్షణతో కూడిన ఏకాగ్రతతో కూడిన శాంతిభద్రతల అమలుకు ఆమెకు మంచి పేరు తెచ్చి పెట్టినది. ఆమె హాయంలో నంద్యాల పోలీసులు ప్రస్తుతం అమలు చేస్తున్న నిర్దిష్ట పరిపాలన లక్ష్యాలు మరియు భద్రత కార్యక్రమాల గురించి సుస్మిత గారు మరింత లోతుగా తెలుసుకొనే అవకాశాలు ఉన్నాయని మేధావులు ప్రజాస్వామ్యవాదులు చర్చించుకుంటున్నారు.

# గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఇంట్రా క్రికెట్ లీగ్ పోటీలు.

**ముఖ్య అతిథులుగా డాక్టర్ రవి కృష్ణ, పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి. -క్రికెట్ లీగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 06:**
నంద్యాల జిల్లా బాబా నగర్ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆహ్లాదకరంగా ఇంట్రా స్కూల్ క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను నిర్వహించగా ముఖ్య అతిథిగా ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ పాల్గొన్నారు. ఇంట్రా క్రికెట్ పోటీల్లో దాదాపు 8 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను విద్యార్థులు ఆహ్లాదకరంగా తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచేలా కేరింతలు కొట్టారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రీడలపై ఆసక్తి



పెంచేలా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. క్రీడలు ఆడించేలా చరోచూపాలని క్రీడలతోనే విద్యార్థులకు మనోధైర్యం మేధాశక్తి పెరుగుతుందని గుర్తు చేశారు.



మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చూడాలని తెలిపారు. ఇంట్రా క్రికెట్ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఉషా కళ్యాణి, స్కూల్ డీన్ బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు.

**..దేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 06:**
శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల , జిల్లా యువజన , ఎన్ .ఎస్.ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో దేశభక్తుడు, ప్రముఖ విద్యావేత్త, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థుల దైవప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమాని జిల్లా యువజన అధికారి ఐజయ్య గారు, కళాశాల ప్రతినిధులతో కలిసి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులర్పించారు.

**భారతదేశ సమగ్రతకు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు అనన్య సామాన్యం: జిల్లా యువజన అధికారి ఐజయ్య**

ఈ సందర్భంగా ఐజయ్య విద్యార్థులను ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ...“భారతదేశ సార్వభౌమాధికారాన్ని, జాతీయ సమగ్రతను కాపాడటంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోషించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయస్కుడైన వైస్ ఛాన్సలర్‌గా విద్యా రంగంలో ఆయన తెచ్చిన సంస్కరణలు ఎంతో ప్రాధాన్యత కలిగినవి.దేశ పురోగతి అనేది యువత చేతుల్లోనే ఉందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించాలి. నేటి తరం కేవలం వ్యక్తిగత ఎదుగుదలకే పరిమితం కాకుండా, దేశభక్తిని, క్రమశిక్షణను అలవర్చుకోవాలి. సమాజంలో ఉత్తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ, నిస్వార్థ సేవ చేయడానికి ముందుకు రావాలి. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారి జీవితాన్ని, ఆయన పడిన





శ్రమను నిరంతరం స్మరించుకుంటూ, నవభారత నిర్మాణంలో యువత అంతా భాగస్వాములు కావాలి,“ అని పిలుపునిచ్చారు.

**ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి : డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి**

అనంతరం కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారి సిద్ధాంతాలను కొనియాడారు.“శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవితం, ఆయన ఆశయాలు, నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన చేసిన పోరాటం నేటి యువతరానికి నిరంతర స్ఫూర్తిదాయకం. విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే పరిమితం కాకుండా, విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలు సాధిస్తూనే నైతిక విలువలను, సామాజిక బాధ్యతను కాపాడుకోవాలి.

సమాజ శ్రేయస్సు కోసం, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. సమాజ సేవ చేసే మార్గంలో ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా సరే... ధైర్యంగా నిలబడి, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నీ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి. విద్యార్థులంతా దేశ సేవలో పునరంకితం కావడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి,“ అని పేర్కొన్నారు.

**ఘన సత్కారం - బహుమతుల ప్రదానం:**

ఈ సందర్భంగా విద్యా, సామాజిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న జిల్లా యువజన అధికారి ఐజయ్య ను కళాశాల యాజమాన్యం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించింది. అనంతరం, ఈ వేడుకల పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఐజయ్య చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక-అధ్యాపకేతర బృందం, మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కి పుష్పాంజలి ఘటించారు. దేశ ప్రగతికి, సామాజిక సేవకు కట్టుబడి ఉంటామని విద్యార్థులంతా ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.